క్లుప్తంగా

ఒత్తిడి లేని జీవితం గడపాలి



ర్యాలీలో పాల్గొన్న వైద్యులు

జమ్మికుంట: ప్రతిఒక్కరూ ఒత్తిడి లేని జీవితాన్ని గడపాలని డాక్టర్ ఉడుగుల సురేశ్ అన్నారు. పట్టణంలోని సంజీవని మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ హార్ట్ డే కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ కళాశాల మైదానంలో మూడు కిలోమీటర్ల నడక (వాకతాన్)ను నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సురేశ్ మాట్లాడుతూ ఈ మధ్యకాలంలో ఎక్కువగా గుండెపోటుతో మరణిస్తున్నారన్నారు. ధూమపానం, మద్యపానానికి దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

పీఏసీఎస్ చైర్మన్‌కు అభినందన

చొప్పదండి: దేశంలోని 95 వేల సహకారాల సంఘాల పనితీరులో చొప్పదండి పీఏసీఎస్ జాతీయ స్థాయిలో మొదటిస్థానంలో నిలవడం పట్ల ఇఫ్‌కో చైర్మన్ దిలీప్‌కుమార్ సంఘాని, ఎండీ ఉదయ్‌కుమార్ అవస్థిలు పీఏసీఎస్ చైర్మన్‌ను అభినందించారు. ఈ మేరకు ఢిల్లీలో శుక్రవారం జరిగిన ఇఫ్‌కో సర్వసభ్య సమావేశంలో చైర్మన్ వెల్మ మల్లారెడ్డిని వేదికపై అభినందించారు. టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్ రావు, గట్టుదుద్దెనపల్లి రాయికల్, పారండ్ల చైర్మన్లు అనభేరి రాధాకిషన్ రావు, ఏనుగు మల్లారెడ్డి, సింగిరెడ్డి స్వామిరెడ్డి పాల్గొన్నారు.

రికార్డుల పరిశీలన

జమ్మికుంట: పట్టణంలోని వేర్ హౌజ్ గోదాంలో బియ్యం నిల్వలు, రికార్డులను హుజూరాబాద్ ఆర్డీవో రాజురెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గోదాం పరిధిలోని రేషన్ డీలర్లకు తూకంలో తేడాలు లేకుండా, వారికి కేటాయించిన మేరకు అందించాలని అధికారులకు సూచించారు. ఆర్డీవో కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ శేఖర్, ఆర్ఐ తిరుపతి పాల్గొన్నారు.

'తపాలా' సేవలు వినియోగించుకోవాలి

హుజూరాబాద్ : తపాలాశాఖ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని పెద్దపల్లి పోస్టల్ సూపరింటెండెంట్ పసునూరి ప్రభాకర్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని తపాలా శాఖ కార్యాలయంలో తపాలా సేవల సమీక్షత సమ్మేళనం పోస్ట్ మాస్టర్ మహేందర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా అన్నితపాలా శాఖ కార్యాలయాల్లో అధికారులు, ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ గందె రాధిక శ్రీనివాస్, తహసీల్దార్ విజయ్ కుమార్, ఏఎస్పీ మోహన్, ఉద్యోగులు, పోస్టల్ ఏజెంట్లు, వినియోగదారులు, ప్రజలు పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

వీణవంక: మండలంలోని మల్లారెడ్డిపల్లిలో హలో ముదిరాజ్ చలో పరకాల సింహగర్జన, బైక్ ర్యాలీని అక్టోబర్ 1న పరకాలలో నిర్వహిస్తున్నారని, ముదిరాజ్‌లు భారీసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ముదిరాజ్ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ కళాకారుడు గోనెల సమ్మయ్య కోరారు. ఈ మేరకు సింహగర్జన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ముదిరాజ్‌లు, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

చిగురుమామిడి: మండలకేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, చిన్న ములకనూర్‌లోని ఆదర్శ పాఠశాలలో నాన్ టీచింగ్ పోస్టులకు ఔట్ సోర్సింగ్ పద్ధతిలో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేజీబీవీలో నైట్ వాచ్‌మెన్ ఒక పోస్టు ఖాళీగా ఉందని, పదో తరగతి పాసై 18 నుంచి 45 సంవత్సరాల్లోపు వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆదర్శ పాఠశాలలో కేర్ టేకర్ కింద ఒక పోస్టు ఖాళీ ఉందని, డిగ్రీ లేదా బీఎడ్, డీఎడ్ పూర్తిచేసి 25 నుంచి 40 సంవత్సరాల్లోపు వారు అర్హులన్నారు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదు సంవత్సరాల సడలింపు ఉంటుందని ఎంఈవో తెలిపారు. వచ్చేనెల 4తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు.

సహకార సంఘాలతో ఒరిగిందేమీ లేదు

సైదాపూర్: మండలంలోని వెన్నంపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అర్ధవార్షిక మహాసభ చైర్మన్ బిల్లా వెంకటరెడ్డి అధ్యక్షతన జరిగింది. సభలో ఎగ్లాస్‌పూర్, ఆరెపల్లి, లస్మన్నపల్లి, వెన్నంపల్లి సర్పంచులు రాజిరెడ్డి, పాపయ్య, రాములు, పద్మ పాల్గొని మాట్లాడారు. ఎగ్లాస్‌పూర్ సర్పంచ్ రాజిరెడ్డి, వెన్నంపల్లి సర్పంచ్ పద్మ మాట్లాడుతూ, ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ రైతులకు ఎంతో మేలు చేశారని, మూడోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. బీఆర్ఎస్ మీటింగ్ కాదని డైరెక్టర్ సారబుడ్ల రాజిరెడ్డి అభ్యంతరం తెలిపారు. సహకార సంఘాలతో రైతులకు ఒరిగిందేమీ లేదన్నారు. సంఘంలో 615 మందిలో 150 మందికి రుణమాఫీ కావాల్సి ఉందని, రూ.లక్ష రుణమాఫీ 24 మందికి వచ్చిందని చైర్మన్ వెంకటరెడ్డి తెలిపారు. వచ్చేనెలలో సహకార సంఘం నూతన భవనం ప్రారంభిస్తామన్నారు. డైరెక్టర్లు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కలగానే 'డబుల్' ఇళ్లు

- నిర్మాణ పనులు చేపట్టేందుకు ముందుకురాని కాంట్రాక్టర్లు
- ఏళ్లుగా పనుల్లో జాప్యం
- నిర్మాణ బాధ్యత లబ్ధిదారులదేనా ?



అసంపూర్తిగా డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలు

చొప్పదండి: గూడులేని నిరుపేదల కోసం నిర్మిస్తున్న రెండు పడుక గదుల ఇళ్ల నిర్మాణంలో అడుగు ముందుకుపడటం లేదు. అయిదన్నరేళ్ల క్రితం శంకుస్థాపన చేసిన ఇళ్ల నిర్మాణాల్లో జాప్యం జరుగుతుండటంతో డబుల్ బెడ్‌రూం ఇళ్ల మంజూరు కలేనా అనే అనుమానాలు లబ్ధిదారుల్లో వ్యక్తమవుతున్నాయి. గత కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిన వ్యక్తిగత ఇళ్ల నిర్మాణ స్థానాల్లో అర్హులైన పేదలను పరిమిత సంఖ్యలో ఎంపిక చేసి చేపట్టిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం మధ్యలోనే నిలిచిపోయింది. అటు ఇళ్ల నిర్మాణాలకు గృహలక్ష్మి మంజూరు లేక, ఇటు కేటాయించిన ఇళ్ల నిర్మాణాలు పూర్తవుతాయో లేదో తెలియక లబ్ధిదారులు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

లబ్ధిదారుల ఎంపిక, కేటాయింపు పూర్తి

చొప్పదండి పట్టణంతో పాటు గుమ్లాపూర్, కొలిమికుంట, రుక్మాపూర్, చాకుంట, కాట్నపల్లి, వెదురుగట్ట, భూపాలపట్నం గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు రెండు పడుక గదుల ఇళ్లు కేటాయించారు. ఆరేళ్ల క్రితం అయిదు గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి అర్హులను ఎంపికచేశారు. 2018లో గత ప్రభుత్వంలోని మంత్రి, ఎమ్మెల్యేలు ఇందిరమ్మ ఇళ్ల ప్లాట్ల లబ్ధిదారుల నిరసనల మధ్య రెండు పడుక గదుల ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. నిర్మాణ సముదాయం వద్దకు పాత వెదురుగుట్ట రోడ్డు నుంచి కనీసం రోడ్డు కూడా ఏర్పాటు చేయకుండానే నిర్మాణాలు ప్రారంభించడం గమనార్హం. ఇటీవల మిగిలిన గ్రామాల్లోనూ లబ్ధిదారుల ఎంపిక చేపట్టారు. ఎంపికైన లబ్ధిదారులకు డబల్ బెడ్‌రూం ఇళ్లను లాటరీ పద్ధతిలో కేటాయించారు. ఇళ్ల నిర్మాణం పూర్తయితే గృహప్రవేశం చేసుకోవచ్చని లబ్ధిదారులు ఆశపడ్డారు. గతేడాది అధికారులు, ప్రజాప్రతినిధులు పాత వెదురుగట్టలోని నిర్మాణాల వద్దకు వెళ్లడమే తప్పా పైసా పని జరగకపోవడంతో పలువురు లబ్ధిదారులు తమకు గృహలక్ష్మి కింద లబ్ధిదారులుగా ఎంపికచేయాలని, తాము డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం వదులుకుంటామని చెబుతున్నట్లు సమాచారం.

లబ్ధిదారులకే నిర్మాణ బాధ్యతలు

డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణానికి కాంట్రాక్టర్లు ముందుకురావడం లేదని తెలుస్తోంది. బిల్లులు సకాలంలో రాకపోవడంతో గతంలో కాంట్రాక్టర్ మధ్యలోనే వదిలివెళ్లారు. దీంతో కొత్తగా నిర్మాణ పనులు అప్పగించేందుకు అధికారులు ప్రయత్నాలు చేస్తున్నా ఎవరూ ముందుకురావడం లేదు. దీంతో లబ్ధిదారులే గృహ నిర్మాణాలు పూర్తి చేయాలని ఆదేశించి, బిల్లులు కూడా వారికే చెల్లించే యోచనలో అధికారులున్నారు. ఈ మేరకు ప్రజాప్రతినిధుల సమక్షంలో లబ్ధిదారులతో సమావేశం నిర్వహించి నిర్మాణాలు పూర్తి చేయించే దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయి.

డబుల్ బెడ్‌రూం ఇళ్ల వివరాలు

నిర్మాణ ప్రాంతం :	చొప్పదండి
మంజూరైన ఇళ్లు	169
పూర్తయిన ఇళ్లు	0
లబ్ధిదారుల సంఖ్య	169

సమావేశం నిర్వహిస్తాం

డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాల లబ్ధిదారుల ఎంపికపూర్తయింది. లబ్ధిదారులే నిర్మాణాలు పూర్తి చేసేలా అవసరమైన చర్యలు చేపడుతాం. త్వరలో ప్రజాప్రతినిధుల సమక్షంలో లబ్ధిదారులతో సమావేశం నిర్వహిస్తాం. డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం పూర్తి చేయడంపై నిర్ణయాలు తీసుకుంటాం.

– జి.నరేందర్, తహసీల్దార్, చొప్పదండి

వికలాంగుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

- మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్



ట్రై సైకిళ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రసమయి

మానకొండూర్ రూరల్: వికలాంగుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. మండలకేంద్రంలోని శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో దివ్యాంగ మహిళలు, చిన్నారులకు వికలాంగుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ట్రై సైకిళ్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రసమయి మాట్లాడుతూ ప్రభుత్వం వికలాంగుల కో ఆపరేటివ్ కార్పొరేషన్, అలింకో సంస్థ సహకారంతో 30 మందికి ట్రైసైకిళ్లు, ఇద్దరికి రూ.50 వేల ఆర్థికసాయం అందించడం ఆనందంగా ఉందన్నారు. వికలాంగులకు ఆర్థిక చేయూత పథకం ద్వారా రుణ సదుపాయం అందిస్తున్నామన్నారు. వికలాంగులకు దేశంలో తెలంగాణలోనే రూ.4వేల పింఛన్ అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శేఖర్, జిల్లా సంక్షేమాధికారి సరస్వతి, ఐసీడీఎస్ సీడీపీవో సబిత, అలింకో ఇన్‌చార్జి ప్రశాంత్, ఎంపీవో రాజేశ్వర్ రావు, వికలాంగులు తదితరులు పాల్గొన్నారు.

మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలి

శంకరపట్నం: మహనీయులను విద్యార్థులు, యువత ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. శుక్రవారం మండలంలోని అంబాల్‌పూర్‌లో సర్దార్ సర్వాయి పాపన్న, అంబేద్కర్ విగ్రహాలను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. మండలంలోని తాడికల్, అంబాల్‌పూర్ గ్రామాల్లో కమ్యూనిటీ భవనాలకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాట చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. యువత సర్వాయి పాపన్న పోరాట పటిమను అంబేద్కర్ స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. సమావేశంలో సుడా చైర్మన్ జీవీ రామకృష్ణారావు, జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్‌లు వసంత, సుజాత, సంజీవరెడ్డి, వైస్‌ఎంపీపీ రమేశ్, ఎంపీటీసీలు వరలక్ష్మి, తిరుపతయ్య, నాయకులు సతీశ్, శ్రీనివాస్, సంపత్, మహిపాల్, మలహర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

'స్వచ్ఛభారత్'లో భాగస్వాములు కావాలి

- చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవిశంకర్

గంగాధర: స్వచ్ఛతలో దేశానికే రాష్ట్రం రోల్ మోడల్‌గా నిలుస్తుందని చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పేర్కొన్నారు. ఆగాఖాన్ స్వచ్ఛ మిషన్, ట్రస్మా ఆధ్వర్యంలో చేపట్టిన స్వచ్ఛభారత్, స్వచ్ఛ్ స్కూల్ కార్యక్రమాన్ని మండలంలోని వివేకానంద హైస్కూల్‌లో ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన 20 అవార్డుల్లో 19 అవార్డులు తెలంగాణకే దక్కాయన్నారు. స్వచ్ఛభారత్‌లో విద్యార్థులు భాగస్వాములు కావాలన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. స్వచ్ఛ్ కార్యక్రమంపై రాష్ట్రంలోని పదివేల పాఠశాలల్లోని 35 లక్షల మంది విద్యార్థులకు అవగాహన కల్పిస్తామన్నారు. ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావు, నియోజకవర్గ అధ్యక్షుడు పర్రెం లక్ష్మారెడ్డి, ఆగాఖాన్ రాష్ట్ర కో ఆర్డినేటర్ సెల్వరాజ్, స్వచ్ఛ్‌భారత్ కో ఆర్డినేటర్ రమేశ్ సర్పంచ్ గంగాధర్, నవీన్‌రావు, వేముల దామోదర్, వేముల లావణ్య-అంజి, దోమకొండ మల్లయ్య, నరోత్తంరెడ్డి, పానుగంటి సత్యం, హెచ్‌ఎం అనంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ జాతీయభావం పెంపొందించుకోవాలి

రామడుగు: ప్రతిఒక్కరూ జాతీయభావం పెంపొందించుకొని, దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పేర్కొన్నారు. గోపాల్‌రావుపేట ప్రధాన చౌరస్తాలో నేచర్ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో జాతీయ జెండా (55 అడుగులు) ఏర్పాటు చేసే పనులకు భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. రూ.9 లక్షలతో నిర్మించే పలు కమ్యూనిటీ భవనాల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఎంపీపీ కవిత లక్ష్మణ్, మాజీ ఎంపీపీ కిష్టారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతి, బీఆర్ఎస్ మండల శాఖ అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు నేచర్ యూత్ క్లబ్ అధ్యక్షుడు పర్శారాంగౌడ్, గౌరవాధ్యక్షుడు అంజయ్యగౌడ్, క్లబ్ సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు, మండల ఆర్‌ఎంపీ, పీఎంపీలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

తనుగుల ఎంపీటీసీ రాజీనామా



మాట్లాడుతున్న నిరోష రామస్వామి

జమ్మికుంట: బీఆర్ఎస్‌కు రాజీనామా చేస్తున్నట్లు తనుగుల ఎంపీటీసీ వాసాల నిరోష రామస్వామి అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. 2004 నుంచి ఇప్పి వరకు పార్టీకోసం పనిచేస్తున్నట్లు తెలిపారు. కొద్దిరోజుల క్రితం ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి తన ఇంటికి పిలిపించుకొని, దూషించాడని, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన అనుచరులతో కలిసి వినోద్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు రామకృష్ణరావుకు రాజీనామా పత్రాన్ని అందజేస్తున్నట్లు ప్రకటించారు. 4న బీఎస్పీ అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో పార్టీలో చేరనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పలు గ్రామాలకు చెందిన నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అర్హులకే పథకాలు అందించాలి



మాట్లాడుతున్న రమణారెడ్డి

తిమ్మాపూర్: ప్రభుత్వం అనర్హులకు పథకాలు అందిస్తోందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మోరపల్లి రమణారెడ్డి, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ఎలుకపల్లి సంపత్ ఆరోపించారు. మండలం నుస్తులాపూర్‌లో పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న దళితబంధు, గృహలక్ష్మి నిరుపేదలందరికీ అందేలా చూడాలన్నారు. కేవలం బీఆర్ఎస్ కార్యకర్తలకే ప్రభుత్వ పథకాలు అందిస్తున్నారని గ్రామసభ ఏర్పాటు చేసి లబ్ధిదారులను గుర్తించాలన్నారు. అనంతరం కాంగ్రెస్ గ్యారంటీ కార్డులను పంపిణీ చేశారు. నియోజకవర్గంలో ఇప్పటివరకు వందమందికి దళిత బంధు అందించారని, ఎమ్మెల్యే రసమయి మాత్రం 1100 మందికి ఇచ్చినట్లు గొప్పగా చెప్పుకుంటున్నారని ఆరోపించారు. అంతకుముందు కాంగ్రెస్ మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మరోసారి మోరపల్లి రమణారెడ్డి నియామకమయ్యారు. తన నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎస్ఎల్ గౌడ్, జిల్లా అధికార ప్రతినిధి ఎలకపల్లి సంపత్, జిల్లా కార్యదర్శులు మామిడి అనిల్, సముద్రాల లక్ష్మణ్, నాయకులు శ్రీనివాస్, రమేశ్‌గౌడ్, చిరంజీవి, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



గన్నేరువరంలో నిరసన తెలుపుతున్న మధ్యాహ్న భోజన కార్మికులు

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం అంబేద్కర్ విగ్రహం వద్ద శుక్రవారం మధ్యాహ్నభోజన కార్మికులు కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డించేందుకు సకాలంలో ప్రభుత్వం బిల్లులు చెల్లించడం లేదని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు బుచ్చన్న యాదవ్ ఆరోపించారు. ప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి సమ్మయ్య, నాయకులు సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

గన్నేరువరం: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని మండల అధ్యక్షురాలు విజయలక్ష్మి పేర్కొన్నారు. తహసీల్దార్ ఎదుట శుక్రవారం నిరసన తెలిపారు. ఇప్పటికైనా పెండింగ్ బకాయిలతో పాటు పెరిగిన జీతాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. సీపీఐ నాయకులు మద్దతు తెలిపారు. మండల అధ్యక్షుడు కాంతాల అంజిరెడ్డి, సహాయ కార్యదర్శి చొక్కాల శ్రీశైలం, కోశాధికారి గర్శకుర్తి శ్రీనివాస్, కనుకయ్య, మలయ్య, సాగర్‌రెడ్డి, కనకలక్ష్మి, కవిత, సత్తవ్వ, విజయలక్ష్మి, దుర్గవ్వ, రాజవ్వ, సరిత, ఎల్లవ్వ పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి



హుజూరాబాద్ : మైనింగ్ మాఫియా ఆగడాలను అరికట్టాలని సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ... సర్వాయి పాపన్న గుట్టలను పరిరక్షించాలని కోరుతూ ఈనెల 30న పాపన్న గీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించి ఆర్డీవోకు వినతిపత్రం అందజేయనున్నట్లు తెలిపారు. భీమదేవరపల్లి, హుస్నాబాద్ ప్రాంతాల్లో విస్తరించి ఉన్నాయన్నారు. సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘం బాధ్యులు సింగం సత్యన్న గౌడ్, సత్యనారాయణ గౌడ్, మార్క అనిల్ గౌడ్, గోపగోని సారయ్య గౌడ్, కోడూరి పరుశరాములు గౌడ్, బుచ్చయ్య గౌడ్, ముత్యం శంకర్ గౌడ్, శ్రీకాంత్ గౌడ్, సాయిలు గౌడ్, శ్రీనివాస్ గౌడ్, రమేశ్‌గౌడ్, పెరమండ్ల సదయ్య గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, కుమార్ గౌడ్, పంజాల రామ్‌శంకర్, తదితరులున్నారు.

అవకతవకలకు పాల్పడితే చర్యలు



మాట్లాడుతున్న డీఆర్డీఏ పీడీ శ్రీలత

సైదాపూర్: ప్రభుత్వ పథకాల అమలులలో సిబ్బంది అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని కరీంనగర్ డీఆర్డీఏ పీడీ శ్రీలత హెచ్చరించారు. శుక్రవారం సామాజిక తనిఖీ నివేదికలు మండల సభలో వినిపించారు. ఉపాధి హామీ పథకం 2022–23లో చేపట్టిన పనులపై మండలంలోని 26 గ్రామ పంచాయతీల్లో గతవారం సామాజిక తనిఖీ నిర్వహించారు. ార్యక్రమంలో ఎంపీడీవో పద్మావతి, అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

స్వయం ఉపాధి యూనిట్లు పరిశీలన

మండలకేంద్రంలోని వెన్కెపల్లిలో న్యూ ఎంటర్ ప్రైజెస్ కూతాటి లత సిమెంట్ బ్రిక్స్ నిర్వహణను డీఆర్డీఏ పీడీ శ్రీలత శుక్రవారం పరిశీలించారు. వీవో కల్యాణి నిధి నుంచి బ్యాంక్ లింకేజీ రూ.3 లక్షలు రుణం బ్రిక్స్ తయారీకి మంజూరు చేశారు. యూనిట్ నిర్వహణ, స్వయం ఉపాధి తదితర వివరాల గురించి నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీవో పద్మావతి, ఏపీఎం కుమారస్వామి, సీసీలు పర్శరాములు, శ్రీనివాస్, రంజిత్, వీవోఏ సరిత, మండల సమైఖ్య అధ్యక్షురాలు రజిత తదితరులు పాల్గొన్నారు.

పేదింటి ఆడబిడ్డలకు వరం 'కల్యాణ లక్ష్మి'



కల్యాణలక్ష్మి చెక్కు అందజేస్తున్న కౌశిక్‌రెడ్డి

ఇల్లందకుంట: పేదింటి ఆడబిడ్డలకు కల్యాణలక్ష్మి పథకం వరమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని ఇల్లందకుంట, కనగర్తి, లక్ష్మాజిపల్లి, మల్యాల, వాగొడ్డు రామన్నపల్లి, సిరిసేడు, సీతంపేట, తదితర గ్రామాల్లోని 43 మంది లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారుల ఇంటికి వెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దేశంలో ఎక్కడా లేని విధంగా నిరుపేద యువతుల వివాహానికి సీఎం కేసీఆర్ కల్యాణలక్ష్మి అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పావని వెంకటేశ్, సర్పంచులు పుట్టరాజు, మొగిలి, వెంకటస్వామి, రాజిరెడ్డి, ఎంపీటీసీ సంజీవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

✦ఆర్థికసాయం అందజేత

వీణవంక: మండలంలోని లస్మక్కపల్లి గ్రామానికి చెందిన లోకిని రవికుమార్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. బాధిత కుటుంబానికి వీణవంక గ్రామానికి చెందిన ట్యూరిటో, యుప్ టీవీ సీఈవో పాడి ఉదయానందన్‌రెడ్డి రూ.5వేలను ఆర్థికసాయంగా తన అనుచరుల ద్వారా మృతుడి కుటుంబానికి అందించారు. మాజీ ఉపసర్పంచ్ సమ్మిరెడ్డి, మర్రి సమ్మయ్య, రవి, కిషన్‌రెడ్డి, తదితరులున్నారు.

✦బోర్ మోటార్ ప్రారంభం

జమ్మికుంట: మండలంలోని కోరపల్లి ప్రభుత్వ పాఠశాలలో పీఎంకే ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పల్లె ప్రభాకర్ గౌడ్ విద్యార్థులకు తాగునీటి వసతి కల్పించేందుకు బోరు వేయించి, 30 వేలతో మోటార్‌ను బిగించారు. ఫౌండేషన్ నిర్వహకులు పల్లె రవిగౌడ్, ప్రిన్సిపాల్ సమ్మయ్యలు ప్రారంభించారు. రంజిత్ కుమార్‌గౌడ్, యాదిగిరిగౌడ్, రాజయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

✦చెత్త తొలగింపు

శంకరపట్నం : మండలంలోని కొత్తగట్టు మత్స్య గిరీంద్రస్వామి గుట్టపై శుక్రవారం అధికారులు స్వచ్ఛత కార్యక్రమం చేపట్టారు. గుట్ట ఆవరణలో చెత్తను తొలగించారు. ఎంపీడీవో శ్రీవాణి, ఎంపీవో బషీరొద్దీన్, ఏపీవో శారద, తదితరులు పాల్గొన్నారు.

✦ ప్లేట్ల పంపిణీ

చొప్పదండి: మండలంలోని రుక్మాపూర్ జెడ్పీహెచ్ఎస్, ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బండిపెల్లి ధర్మయ్య జ్ఞాపకార్థం అడ్వకేట్ శ్రీనివాస్‌గౌడ్, పరుశరాం గౌడ్, మల్లికార్జున్‌గౌడ్ ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేశారు. హెచ్‌ఎం రఘుకిషోర్, శ్రీధర్, సరోజ, శ్రీనివాస్, పుష్పలత, ఇందిర, యశోద, సురేందర్, రమేశ్ పాల్గొన్నారు.

✦ సమస్యలు పరిష్కరించాలని వినతి

గన్నేరువరం: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లు శుక్రవారం మండల పరిషత్‌లో ఎంపీడీవో స్వాతి, ఎంపీవో నర్సింహారెడ్డికి వినతిపత్రం అందజేశారు. కంప్యూటర్ ఆపరేటర్లు పద్మ, శివసాయి, శంకర్, అశ్విని పాల్గొన్నారు.

✦సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యం

గన్నేరువరం: కాంగ్రెస్ పార్టీ ఇటీవల ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలపై పార్టీ మండల అధ్యక్షుడు ముస్కు ఉపేందర్ రెడ్డి, గ్రామశాఖ అధ్యక్షుడు చింతల శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం మండలకేంద్రంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. జిల్లా ఉపాధ్యక్షుడు రవీందర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి బొడ్డు సునీల్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కొలుపుల రవీందర్, ఇన్‌చార్జి నర్సింహారెడ్డి, పర్శరాములు, నవీన్, పెంకర్ల ప్రశాంత్, హరీశ్ పాల్గొన్నారు.

✦కాంగ్రెస్‌తోనే ప్రజలకు మేలు

శంకరపట్నం: కాంగ్రెస్‌తోనే ప్రజలకు మేలు జరుగుతుందని కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండలంలోని ధర్మాపూర్, కన్నాపూర్ గ్రామాల్లో శుక్రవారం ఇంటింటా ప్రచారం చేశారు. పలువురికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నాయకులు శ్రీనివాస్‌గౌడ్, బస్వయ్య, విజయ, సదానందం, పాపిరెడ్డి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.


✦నియామకం

ఇల్లందకుంట: అఖిలభారత యాదవ మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శిగా మండలంలోని లక్ష్మాజిపల్లికి చెందిన సీనియర్ నాయకుడు సింగిల్‌విండో డైరెక్టర్ నన్నెబోయిన రవియాదవ్‌ను నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు నాగారపు సత్యనారాయణ యాదవ్ శుక్రవారం నియామకపత్రం అందజేశారు. తన నియామకానికి సహకరించిన వారికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

స్వచ్ఛతా హీ సేవా

ఇల్లందకుంట: మండలకేంద్రంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని ఎంపీడీవో తీగల శంకర్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సతీ రామచంద్రస్వామి దేవస్థానం ఆవరణ, బహిరంగ ప్రదేశాల్లో చెత్తను తొలగించారు. అనంతరం బ్లీచింగ్ పౌడర్ చల్లి వీధులను శుభ్రం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కంకణాల శ్రీలత, ఏపీఎం రమాదేవి, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో రుణాలు చెల్లించాలి



మాట్లాడుతున్న జంగ వెంకటరమణారెడ్డి

చిగురుమామిడి: రైతులు సింగిల్‌విండో నుంచి తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించి సంఘం అభివృద్ధికి తోడ్పాటునందించాలని సింగిల్ విండో చైర్మన్ జంగ వెంకటరమణారెడ్డి అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలో సింగిల్‌విండో అర్ధవార్షిక మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాసంగి సీజన్‌లో 1.78 లక్షల క్వింటాళ్ల వరి ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు చెప్పారు. సంఘంలో 459 మంది సభ్యులున్నారని, వీరిలో 330 మంది రైతులకు రుణమాఫీ వచ్చిందన్నారు. ఇంకా 129 మందికి రుణమాఫీ రావాల్సి ఉందన్నారు. ప్రభుత్వం నుంచి 1.95 కోట్లు రుణమాఫీ డబ్బులు వచ్చాయన్నారు. చిగురుమామిడి, ఇందుర్తి, రేకొండ సెంటర్లలో ఎరువుల వ్యాపారం చేస్తున్నట్లు తెలిపారు. 534 మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు అందించినట్లు పేర్కొన్నారు. 2.50 కోట్ల ఆదాయంతో చిగురుమామిడి సింగిల్‌విండో కొనసాగుతుందని, గోదాం నిర్మాణం కోసం స్థల సేకరణ జరుగుతుందని, ఆయన తెలిపారు. సమావేశంలో సంఘం ఉపాధ్యక్షుడు కరివేద మహేందర్ రెడ్డి, డైరెక్టర్లు చాడ శ్రీధర్‌రెడ్డి, మాచమల్ల లక్ష్మి, అందె స్వామి, పోతరవేని శ్రీనివాస్, కూతురు రవీందర్ రెడ్డి, తాళ్లపల్లి తిరుపతి, పేరాల లక్ష్మి, రైతుబంధు సమితి జిల్లా కమిటీ సభ్యుడు సాంబారి కొమురయ్య, కేడీసీసీ మేనేజర్ అనిత, సొసైటీ సీఈవో నర్సయ్య, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

డిమాండ్లు పరిష్కరించాలని ధర్నా

చిగురుమామిడి: తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ మండల తహసీల్దార్ కార్యాలయం ముందు ఆశావర్కర్లు శుక్రవారం ధర్నా నిర్వహించారు. మండల ఆశావర్కర్ల సంఘం అధ్యక్షురాలు నాగెల్లి పద్మ, కార్యదర్శి పెద్దపల్లి శోభ, సంఘం నాయకురాళ్లు సరోజన, మంజుల, అంజలి, కమల, సరోజన , తిరుమల, సంధ్య, కవిత, స్రవంతి, లక్ష్మి, పుష్ప, నాగరాణి పాల్గొన్నారు.

గన్నేరువరం: పెంచిన వేతనాలను ప్రభుత్వం వెంటనే అమలుచేయాలని ఆశావర్కర్లు డిమాండ్ చేశారు. మండలంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం సీనియర్ అసిస్టెంట్‌కు వినతిపత్రం అందజేశారు. మండల కార్యదర్శి కాంతాల అంజిరెడ్డి, సహాయ కార్యదర్శి శ్రీశైలం, కూన మల్లయ్య, శ్రీనివాస్, సాగర్‌రెడ్డి, ఆశావర్కర్ల సంఘం మండల అధ్యక్షుడు ఎండీ రజియా, మంజుల, పుష్పలత, సునీత, శ్యామల, లావణ్య, రేణుక, సుజాత, కవిత, రేణుక, విజయలక్ష్మి, మంగ, పద్మ పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కరీంనగర్ జిల్లా :
9951602933, 9951602958, 9951602824
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
రమేష్, ACO - 7997958214
కరీంనగర్ : రాజశేఖర్ - 9618304759
చొప్పదండి : ముండయ్య - 7997958217
మానకొండూర్ : మహేశ్ - 9573106760
హుజూరాబాద్ : ప్రశాంత్ - 7331119941
టోల్ ఫ్రీ నం.: 1800 425 9899